క్లుప్తంగా

కమనీయం.. శ్రీవారి కల్యాణం



అలంకరణలో సతీసమేతంగా శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

ఎర్రగుంట్ల : పట్టణంలోని కోగటం రోడ్డు సుందరయ్య కాలనీ సమీపంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థాన పదవ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారిజాము నుంచి శ్రీవారికి వివిధ అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవిభూదేవి శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణంను శాస్త్రోత్తంగా వేద పండుతులు రాజేష్ వారి బృందం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి కల్యాణంను తిలకించారు. సాయంత్రం శ్రీవారి గ్రామోత్సవంను పురవీధులలో ఘనంగా నిర్వహించారు. కోలాట బృందంతో గ్రామోత్సవం సాగింది.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రమణారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ పులివెందుల వారి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆపిల్ మెడికల్ స్టోర్ వారి సౌజన్యంతో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పాదాచారులకు, వాహనచోదకులకు వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్, కన్వీనర్, డైరెక్టర్లు, కార్యవర్గ సభ్యులు, మానవత సభ్యులు, మెడికల్ స్టోర్ యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వేముల : ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్త ప్రభావతి తెలిపారు. బుధవారం వేములలోని వెంకటేశ్వర అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఆహార పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలు రక్తహీనత లేకుండా పప్పుదినుసులు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం ద్వారా వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే పిల్లల వెయ్యిరోజుల సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

సుమో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మాబుచాన్‌కు నగదును అందజేస్తున్న సుమో స్టాండ్ సభ్యులు

వేంపల్లె : వైఎస్సార్ సుమో స్టాండ్ ఆధ్వర్యంలో డ్రైవర్ షేక్ దర్బార్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. బుధవారం దర్బార్ సతీమణి మాబుచాన్‌కు రూ.50 వేలను వైఎస్సార్ సుమోస్టాండ్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు రాజగోపాల్‌రెడ్డిలు అందించి మాట్లాడారు. స్థానిక కాలేజీ రోడ్డులో ఉన్న షేక్ దర్బార్ డ్రైవర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడని ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నాన్నారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో మృతిచెందడంతో ఆ కుటుంబం ఇబ్బంది పడుతుందన్నారు. సుమో స్టాండ్ సభ్యులందరు డబ్బులను సేకరించి ఆ కుటుంబానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో సుమోస్టాండ్ సభ్యులు పాల్గొన్నారు.

మైనార్టీల ద్రోహి చంద్రబాబు

పులివెందుల రూరల్ : 2014–19లో ఎన్డీఏతో జతకట్టి మైనార్టీలకు కేటాయించిన మంత్రి పదవిని పల్లె రఘునాథరెడ్డికి ఇచ్చి మైనార్టీలను కించపరిచిన మైనార్టీల ద్రోహి చంద్రబాబు అని రాష్ట్ర నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, జిల్లా మైనార్టీ నాయకుడు నూరుల్లాలు తెలిపారు. బుధవారం దూదేకుల సంఘ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికల్లో అన్ని సంఘాల వారు చంద్రబాబు మైనార్టీ ద్రోహి అని నిలదీయడంతో మైనార్టీ వ్యక్తి ఫరూక్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇచ్చామని చెప్పడం నిజం కాదా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014–19లో 5 ఎమ్మెల్యే పదవులు మైనార్టీలకు ఇచ్చారన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఏడు మంది మైనార్టీ అభ్యర్థులకు సీట్లు కేటాయించగా చంద్రబాబు మాత్రం 2 సీట్లు మాత్రమే కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీలు వైఎస్సార్ పార్టీకి అండగా ఉంటారన్నారు.

రైతుల ఇంట వేరుశనగ సిరుల పంట



వేరుశనగ పంటను కోస్తున్న కూలీలు



వేరుశనగ కాయలను చూపిస్తున్న రైతు

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా వేరుశనగ పంట దాదాపు 1450 ఎకరాల్లో రైతులు సాగు చేశారని మండల వ్యవసాయ అధికారి శివమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అంకాలమ్మగూడూరు, బలపనూరు, పైడిపాలెం, సుంకేసుల గ్రామాల్లో ఈ వేరుశనగ పంటను ఎక్కువగా సాగుచేశారన్నారు. మండల వ్యాప్తంగా 1218 రకపు వేరుశనగ పంట సుమారు 800 ఎకరాల్లో సాగుచేసినట్లు ఆయన తెలిపారు. 130 రోజులకు పంట చేతికి రావడంతో ఒక్కొక్క చెట్టుకు 50 నుంచి 120 వేరుశనగ కాయలు ఉండటంతో ఎకరాకు 50 బస్తాలు అవుతాయని రైతులు అంటున్నారు. ప్రస్తుత మార్కెట్ ధర బస్తా రూ.2300లు ఉండగా పెట్టుబడులు పోయి మంచి దిగుబడి వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహానేత వైఎస్సార్ ముందు చూపుతో రైతులకు ఉపయోగకరంగా ఉండటానికి మండలంలోని పైడిపాళెం ప్రాజెక్టు ఏర్పాటు చేయడంతో వర్షాభావం తక్కువగా ఉన్నా చీనీ, తదితర పంటల సాగుకు ఈ నీరు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రాజెక్టు నీరు వృథా కాకుండా ఇటు రైతులకు, అటు ఇరిగేషన్ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల వర్షాభావం తక్కువగా ఉన్నా ప్రాజెక్టు నీటితో పంటలు సాగు చేసుకుంటున్నామని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభసాటి

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగుచేసిన వేరుశనగ పంటలు రైతులకు మంచి దిగుబడినిచ్చి లాభసాటిగా మారాయని మండల వ్యవసాయ సలహాదారుడు అరవిందనాథరెడ్డి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పేడ, ఎరువు, వేపపిండి గానుగలో ఆడించిన నువ్వులు, కొబ్బెర, చెనక్కాయ చెక్కలను మురగబెట్టి ఎరువులుగా వాడటంతో వేరుశనగ మంచి దిగుబడినిచ్చి రైతులకు లాభసాటిగా మారిందన్నారు.

నేటి నుంచి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీలక్ష్మీ నరసింహస్వామి మూల విరాట్

వల్లూరు : పాపాగ్ని నదీ తీరాన మాచిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం స్వామి వారికి అభిషేకాలు, సాయంత్రం విశ్వక్సేనారాధన, ధ్వజారోహణం, అంకురారోహణం, అగ్ని ప్రతిష్ఠ, 22న ఉదయం ప్రధాన కళశ స్థాపన, సాయంత్రం వివిధ హోమాలు, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, 23న ఉదయం వివిధ హోమాలు, సాయంత్రం లక్ష్మీ సహస్ర నామ కుంకుమార్చన, 24న సాయంత్రం సుహాసినీలతో లక్ష్మీపూజ, కుంకుమార్చన, 25న మధ్యాహ్నం 11:20 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఉత్సవాల్లో వివిధ పోటీలు

బ్రహ్మోత్సవాలలో పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 23న రాత్రి 9 గంటలకు రంగస్థల పద్యముల పోటీలు, 24న ఉదయం 9 గంటలకు ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు, రాత్రి 9 గంటలకు తాళం భజన పోటీలు, 25న ఉదయం 9 గంటలకు చెక్క భజన పోటీలు, 10 గంటలకు అల్లెంగుండు ఎత్తు పోటీలు, మధ్యాహ్నం బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. రాత్రి పాటకచ్చేరి జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి మాధవస్వామి..



విద్యుత్ దీపాల అలంకరణలో మాధవస్వామి దేవాలయం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న మాధవస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు వేడుకగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ ఎల్.శ్రీనువాసుల రెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న అంకురార్పణ, 22న శేషవాహనం, 23న సింహవాహనం, 24న హనుమద్వాహనం, 25న గరుడవాహనం, 26న గజారోహణం, 27న రథోత్సవం, 28న అశ్వవాహనం, 29న ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మార్చి 28న బండలాగుడు పోటీలు నిర్వహిస్తారన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తట్టి(అమ్మవారు), సబ్బం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తల నొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నెలాఖరులోపు పన్నులు చెల్లించండి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి, ఖాళీ జాగా పన్నులను ఈనెల ఆఖరులోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 31వ తేదీ లోపు పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్నులను ఏకమొత్తంలో, విడతల వారీగా చెల్లించిన యెడల పన్నుల బకాయిలపై విధించిన వడ్డీ మాఫీ లబ్ధిపొందగలరన్నారు. ఈ అవకాశం కేవలం ఈ ఆర్థిక సంవత్సరానికి మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ఆస్తి పన్ను బకాయిలను వార్డు సచివాలయంలో కానీ, ఆన్‌లైన్ ద్వారా, పురపాలక సంఘ ఖజానా నందు చెల్లించి రసీదులు పొందాలని ఆయన కోరారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

పులివెందుల రూరల్ : వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనదారులు తమ వాహనాలకు స్టిక్కర్లు అతికించరాదన్నారు. ఎన్నికల నిబంధనను వాహనదారులు తప్పక పాటించాలన్నారు. ముఖ్యంగా వాహనదారులు వాహనాలకు సంబంధించి రికార్డులు, లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని మరువకూడదు

ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ప్రజలకు సంక్షేమపథకాల ద్వారా మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు మరువకుండా ప్రతి ఒక్కరూ ఆదరించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అంబవరం గ్రామ పంచాయతీ పరిధి వేమగుంటపల్లె, కొత్తరోడ్డు, అంబవరం, కొత్తగుంటపల్లె గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. 3 సార్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి ఎన్ని పార్టీలు కలసి వచ్చినా ఏమీ చేయలేవన్నారు. చంద్రబాబునాయుడు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నిన ప్రజలు ఆయనను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గతంలో అనేక హామీలను ప్రజలకు ఇచ్చి వాటిని అమలు చేయలేదన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలు జగనన్నతోనే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, జిల్లా ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయుచున్న తనను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మండల కన్వీనర్ శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, తాన నాయక్, చౌడయ్య, మదుమోహన్ నాయుడు, లింగమయ్య, కృష్ణయ్య, రూబెన్, కనకరాజు, మణి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలి



పిల్లలకు పండ్లను అందజేసిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్

వేంపల్లె : ప్రస్తుత సమాజంలో ప్రజలందరూ పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని ఇడుపులపాయ ఒంగోలు ట్రిపుల్‌ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–14 ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతిరెడ్డి తెలిపారు. బుధవారం కుమ్మరాంపల్లె గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం హెల్త్, న్యూట్రీషన్ అనే అంశంపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఆరోగ్య రక్షణలో ఆహారం యొక్క పాత్ర గురించి వివరించారు.

అదేవిధంగా ఆరోగ్యమే మహాభాగ్యం ఫాస్ట్‌ఫుడ్‌ని మానాలని సూచించారు. తాజా పండ్లు, కూరగాయలను తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అలాగే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు ఆరోగ్యం, ఆరోగ్య నియమాలను తప్పక పాటించాలని సూచించి వారికి పండ్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రెడ్డిమాలతి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మధుసూదన, ప్రోగ్రాం ఆఫీసర్లు విశ్వనాథరెడ్డి, అసోషియేట్ డీన్ రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేనిదే ప్రచారం నిర్వహించరాదు

- ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్ నమోదు
- విలేకరుల సమావేశంలో జేసీ, ఆర్ఓ గణేష్‌కుమార్



మాట్లాడుతున్న జేసీ, ఆర్ఓ గణేష్‌కుమార్

కమలాపురం : మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని జేసీ, రిటర్నింగ్ ఆఫీసర్ గణేష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాలకు, బహిరంగ సభలకు, లౌడ్ స్పీకర్లకు, ఇంటింటి ప్రచారం నిర్వహించడానికి ఆర్ఓ నుంచి తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేయాలన్నా, బ్యానర్స్, జెండాలు కట్టాలన్నా అనుమతి తప్పనిసరి అన్నారు. ముఖ్యంగా వాల్ రైటింగ్స్ చేయకూడదన్నారు. అనుమతి లేకుండా ప్రచారం సైతం నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. ప్రచారం నుంచి ఓటింగ్ ముగిసే వరకు ఖర్చును నమోదు చేస్తామన్నారు. మాడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ తప్పని సరిగా పాటించాలన్నారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. వలంటీర్లు ప్రచారంలో, ఎన్నికల విధుల్లో పాల్గొంటే డిస్మిస్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే వలంటీర్లకు సమావేశం నిర్వహించి ఎన్నికల విధుల్లో, ప్రచారంలో పాల్గొనవద్దని సూచించామని, ఎవరైన తిరిగితే వారిని తొలగిస్తామని హెచ్చరించారు. అంతకు ముందు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఎన్నికల విధుల గురించి వివరించారు. ఏఆర్ఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

టీడీపీ నుంచి అదే పార్టీ లోకే వలసలు

మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి

కమలాపురం : కమలాపురంలో టీడీపీ నుంచి అదే పార్టీలోకే వలసలు జరుగుతున్నాయే గాని వైఎస్సార్ సీపీ నుంచి కాదని, ఇలాంటి వలసలతో తమ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి 30 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయం అని మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం కొన్ని పత్రికల్లో అప్పాయపల్లెలో ఆగని వలసలు అనే వార్త ప్రచురితమైందని, ఆ వార్తలో టీడీపీ కండువా వేసుకున్న సునీల్‌రెడ్డి కండువా వేసుకోవడం ఇది మూడోసారి అన్నారు. అలాగే మాచిరెడ్డిపల్లె క్రాస్‌లో కండువా వేసుకున్న వ్యక్తి సామాన్య ఓటరు అంతే కాని, వారు తమ పార్టీ వైఎస్సార్ సీపీ కండువా ఏ రోజు వేసుకోలేదని, జెండా మోయలేదని, అలాగే తమ పార్టీ సభ్యత్వం కూడా తీసుకోలేదని, ఏజెంట్‌గా కూర్చోలేదన్నారు. దీనిని బట్టి రెండు నెలల క్రితం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి చేసిన వ్యాఖ్యలు టీడీపీ నుంచి తెలుగుదేశంలోకే వలసలు అన్న కామెంట్ కరెక్ట్ అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. కొన్ని నెలల క్రితం మా మేనత్త కొడుకు శంకర్‌రెడ్డి కూడా టీడీపీలో చేరాడు. అతను కూడా తనతో ఏ రోజు తిరగలేదని, అతడిని సామాన్య ఓటరుగానే గుర్తించాలే తప్పా, అతను వైఎస్సార్ సీపీ నాయకుడు కాదని స్పష్టం చేశారు. దీనిని బట్టి టీడీపీలో చేరికలన్నీ బూటకమేనన్నారు. ఇలాంటి చేరికలకు టీడీపీ నుంచి తెలుగుదేశంలోకి అనే క్యాప్షన్ పెట్టుకోవాలని ఆయన సూచించారు. మీ కుటుంబానికి, మీ గ్రామానికి, మీ వీధికి మేలు జరిగితేనే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని చెప్పారని, ఇంత దమ్మున్న సీఎంను ఎప్పుడైనా చూశామా? అని ప్రశ్నించారు. మనకు గుర్తుకు వచ్చినప్పటి నుంచి కమలాపురంలో ఇంత అభివృద్ధి ఎప్పుడైనా జరిగిందా? అని ప్రశ్నించారు. మైసూరారెడ్డి, వీరశివారెడ్డి, పుత్తా నరసింహారెడ్డి హయాంలలో ఇంత అభివృద్ధి జరిగిందా? అని అన్నారు. సమావేశంలో రాజారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

పది పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు

వల్లూరు : మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో బుధవారం ఉదయం ఇంగ్లీషు పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 361 మంది విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా 358 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 244 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి వుండగా 241 మంది విద్యార్థులు హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 117 మంది పరీక్ష రాయాల్సి వుండగా 117 మంది హాజరయ్యారు. కాగా మధ్యాహ్నం జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఏపీ మోడల్ స్కూల్‌లో 281 మంది విద్యార్థులకు 266 మంది హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 228 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



జమ్మలమడుగులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు



వీరపునాయునిపల్లె : తలపనూరులో సోదాలు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటరెడ్డి

జమ్మలమడుగు రూరల్ : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు డీఎస్పీ డాక్టర్ యశ్వంత్ తెలిపారు. బుధవారం జమ్మలమడుగు పట్టణం, రూరల్ పరిధిలోని మోరగుడి, గొరిగెనూర్, గూడెంచెరువు గ్రామాల్లోని ఇళ్లలో సోదాలు నిర్వహించి అనంతరం కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ఎన్నికలను పోలీస్ శాఖ సమన్వయంతో విధులు నిర్వహించి సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయన్నారు. ప్రజలు ఆందోళనలు చెందవలసిన అవసరం లేదన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఏమైన సమాచారం ఉంటే ప్రజలు తమకు తెలపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐ కరుణాకర్, ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని గోనుమాకులపల్లె, తలపనూరు గ్రామాల్లో బుధవారం స్థానిక ఎస్ఐ వెంకటరెడ్డి కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి రాజకీయ నాయకుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్న లక్ష్యంతో కేంద్ర భలగాలతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రశాంత వాతారణాన్ని పోలీసు శాఖ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

జగనన్నను గెలిపించుకుందాం



సిద్దారెడ్డిపల్లెలో సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన జగనన్నకు ఓట్లేసి గెలిపించుకుందామని చక్రాయపేట మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఎర్రబొమ్మనపల్లె గ్రామం సిద్దారెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు కలిగిన లబ్ధిని, అలాగే చంద్రబాబునాయుడు చేసిన మోసాలను వివరించారు. గత ప్రభుత్వాలు చక్రాయపేటకు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఎంపీ అవినాష్‌రెడ్డి సహకారంతో కాలేటి వాగు ప్రాజెక్టును అభివృద్ధి చేసి రైతులకు అండగా నిలిచాడన్నారు. త్వరలోనే ప్రాజెక్టు పూర్తవుతుందని మండలంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందన్నారు. మండలం పచ్చని పంటలతో సస్యశామలం అవుతుందన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ మాదవీ బాలకృష్ణ, సర్పంచ్ లక్షుమయ్య, సీంగిల్‌విండో అధ్యక్షుడు శేషారెడ్డి, ఎంపీటీసీ గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ సుబ్బిరెడ్డి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వీరశేఖర రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, జనార్ధనరెడ్డి, బయారెడ్డి, వాసుదేవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.